09-04-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి మనుష్యుల నుండి దేవతలుగా చేయడానికి వచ్చారు కనుక వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలపండి, శ్రీమతంపై నడుస్తూ ఉండండి, ఆ ఒక్కరితో సత్యమైన ప్రీతినుంచుకోండి"

ప్రశ్న:- ఏ పిల్లలకైతే తండ్రి పట్ల ప్రీతి ఉంటుందో, వారి గుర్తులేమిటి?

జవాబు:- తండ్రి పట్ల సత్యమైన ప్రీతి ఉన్నట్లయితే, ఒకటి - వారినే స్మృతి చేస్తారు, వారి మతముపైనే నడుస్తారు. మనసా-వాచా-కర్మణా ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వరు. ఎవరి పట్ల అసహ్యం ఉంచుకోరు. తమ సత్యాతి-సత్యమైన లెక్కాపత్రాన్ని తండ్రికి ఇస్తారు. చెడు సాంగత్యం నుండి స్వయాన్ని సంభాళించుకుంటారు.

గీతము:- ఓర్పు వహించు మానవా... (ధీరజ్ ధర్ మనువా...)

ఓంశాంతి. బ్రాహ్మణులకైతే తప్పకుండా ఓర్పు ఉంటుంది ఎందుకంటే బ్రాహ్మణులకే పరమపిత పరమాత్మతో నంబరువారు పురుషార్థానుసారంగా ప్రీతి ఉంది. అందరికీ ఒకే విధమైన ప్రీతి లేదు. ఎలాగైతే బాబా, మమ్మా మరియు పిల్లలు తమ-తమ అనుభవాలను వినిపిస్తారు. అహమ్ (నేను) ఆత్మ అని స్వయం కోసం అంటారు. బాబా అహమ్ (నేను) పరమాత్మ అని అంటారు. ఆత్మనైన నేను అంటాను, నేను పరమపిత పరమాత్మను చాలా స్మృతి చేస్తాను ఎందుకంటే అర్ధకల్పము నేను రావణ రాజ్యంలో చాలా దుఃఖం చూసానని తెలుసు. అలాగని ప్రారంభం నుండి దుఃఖం ఉంటుందని కూడా కాదు. అలా ఉండదు. రావణ రాజ్యంలో నెమ్మది-నెమ్మదిగా దుఃఖం వృద్ధి చెందుతుంది. కళలు తగ్గిపోతూ ఉంటాయి. ఆత్మనైన నాకు ఇప్పుడు పరమపిత పరమాత్మ తెలియజేస్తున్నారు, మొదట మీరు అవ్యభిచారి భక్తిలో ఉండేవారు, కేవలం నన్ను స్మృతి చేసేవారు. తర్వాత వ్యభిచారీ, రజోగుణీ భక్తిలోకి వచ్చారు. ఇప్పుడైతే తమోగుణీ భక్తిగా అయ్యింది, ఎవరు వస్తే వారిని పూజిస్తూ ఉంటారు, దీనిని భూత పూజ అని అంటారు ఎందుకంటే శరీరం 5 తత్వాలతో తయారుచేయబడి ఉంది. వీరు ఫలానా స్వామి అని కేవలం 5 తత్వాల శరీరాన్ని చూసి అంటారు. అతని చరణాలపై పడతారు. ఇది తమోప్రధాన భక్తి. మనకు మన వారసత్వాన్ని ఇవ్వడానికి పరమపిత పరమాత్మ మళ్ళీ వచ్చారని ఆత్మలైన మనకు ఇప్పుడు తెలుసు, అందుకే ఎంత వీలైతే అంత వారిని స్మృతి చేస్తాము. వారి ఆజ్ఞ ఏమిటంటే, నిరంతరం నన్ను స్మృతి చేయండి. దేహీ-అభిమానీ భవ అనగా ఆత్మ-అభిమానీ భవ. బాబా అంటారు, నేను ఘడియ-ఘడియ తండ్రికి కృతజ్ఞతలు తెలుపుతాను - బాబా, మీరు నన్ను అంధకారం నుండి బయటకు తీసారు. బాబాతో నాకు ప్రీతి ఉంది. మిగిలిన వారందరిదీ వినాశకాలే విపరీత బుద్ధి, వారు పూర్తి వారసత్వాన్ని తీసుకోలేరు. లౌకిక పిల్లలకు తండ్రి పట్ల ప్రీతి ఉంటుంది. వారు తండ్రి మతముపై నడిచినట్లయితే తండ్రి కూడా రాజీ అవుతారు. ఒకవేళ ఆ పిల్లలు మతముపై నడవకపోతే, తండ్రి రాజీ అవ్వరు. ఎవరైతే మతముపై నడవరో, వారు కుపుత్రులు అయినట్లు. కనుక అనంతమైన తండ్రి కూడా అంటారు - నన్ను స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు భస్మమవుతూ ఉంటాయి. నా వారిగా అయ్యారు కనుక కర్మేంద్రియాలతో ఎటువంటి పాప కర్మ చేయకండి. ఎప్పుడూ శ్రీమతాన్ని ఉల్లఘించకండి. తండ్రి మిమ్మల్ని పూజారుల నుండి పూజ్యులుగా చేస్తున్నారు కనుక తండ్రికి ఎంతగా కృతజ్ఞతలు తెలపాలి! వారి మతముపై నడవకపోతే జన్మ-జన్మాంతరాల కోసం పదవిని భ్రష్టం చేసుకుంటారు. ఇక్కడ మనం మురికి పట్టిన వస్త్రాల వంటివారిని భ్రష్టులు అని అంటాము. కానీ అక్కడ తక్కువ పదవిని భ్రష్ట పదవి అని అంటారు. తండ్రి అంటారు, మంచి రీతిలో ప్రీతిని జోడించండి. ఎలాగైతే పత్ని పతిని గుర్తు చేస్తుందో, అలా మీరు నన్ను స్మృతి చేయండి. నా శ్రీమతంపై నడవండి. మనసా, వాచా, కర్మణా ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకండి. మనసులో కూడా ఎవరి పట్ల అసహ్యం ఉంచుకోకండి. ప్రతి ఆత్మ తన పాత్రను అభినయిస్తుంది.

ఇప్పటి ఈ జన్మ భవిష్య జన్మల కన్నా కూడా ఉన్నతమైనదని మీకు తెలుసు. ఇక్కడ మనం ఈశ్వరీయ సంతానంగా అయ్యాము. సత్యయుగంలో దైవీ సంతానంగా ఉంటాము. ఇక్కడి మహిమ ఎక్కువ ఉంటుంది. జగదంబ నుండి 21 జన్మల వారసత్వం లభిస్తుంది. లక్ష్మి నుండి ఏం లభిస్తుంది? ఈ విషయాలను కొత్తవారు ఎవరూ అర్థం చేసుకోలేరు. రావడమైతే చాలామంది వస్తారు కానీ ఎవరికైతే నిశ్చయం ఉండదో, వారు నిలవలేరు. బాబా, మమ్మా మరియు పిల్లల యొక్క మిత్ర-సంబంధీకులు చాలామంది వస్తారు మరియు ఆఫీసర్లు మొదలైనవారు వస్తారు, అప్పుడు అనుమతించడం జరుగుతుంది. ఎవరికైనా బాణం తగలవచ్చు, అభాగ్యుల కళ్యాణం జరగవచ్చు. ఈశ్వరీయ కులానికి

చెందినవారా లేక ఆసురీ కులానికి చెందినవారా, ప్రీతి కలుగుతుందా లేక కలగడం లేదా అన్నది వెంటనే తెలిసిపోతుంది. రావడమైతే ఇక్కడికి చాలామంది వస్తారు, బాగుపడతారు, మళ్ళీ బయటికి వెళ్ళి చెడు సాంగత్యంలో అనగా మాయ సాంగత్యంలో వికారులుగా అయిపోతారు. మేము ఓడిపోయాము అని రాస్తారు. కానీ ఒకవేళ చెప్పకపోతే, ఇంకా వృద్ధి చెందుతూ ఉంటుంది. మీకు ఇప్పుడు తండ్రితో ప్రీతి బుద్ధి ఉంది. అయితే, మీలో కూడా నంబరువారు పురుషార్థానుసారంగా ప్రీతి బుద్ధి ఉంది. శివబాబా పిల్లలకు అర్థం చేయిస్తారు, ఎప్పుడూ ఏ వికర్మ చేయకండి, శ్రీమతంపై నడవండి. బాబాకు చెందినవారిగా అయ్యారు కనుక మీ నడవడిక కూడా అలాగే ఉండాలి. బాబాకు మొత్తమంతా తెలియాలి. బాబా ముక్తి-జీవన్ముక్తిని, విశ్వ రాజ్యాన్ని ఇస్తారు మరియు పిల్లల వద్ద ఏముందో తండ్రికి తెలియనే తెలియదు. తండ్రి వద్దకు పూర్తి లెక్కాపత్రం రావాలి. నాకు ఇవ్వడం వలన మీకు నష్టం కలగదు. వారైతే డబ్బు మొదలైనవన్నీ వారి పని కోసం తీసేసుకుంటారు, నేను అయితే నిరాకారుడిని. పిల్లలైన మీ పనిలోనే ఉపయోగిస్తాను. ఎలాగైతే గాంధీజీ దేశం యొక్క పనిలో ఉపయోగించేవారు, అందుకే వారి పేరు ప్రసిద్ధి చెందింది. నిజానికి గాంధీ కాంగ్రెస్ రాజ్యాన్ని స్థాపన చేసారు. లేదంటే ఇక్కడ రాజుల రాజ్యం ఉండేది. ఇప్పుడు తండ్రి మళ్ళీ కొత్త రాజధానిని, రామ రాజ్యాన్ని స్థాపన చేస్తున్నారు - ఈ విషయం పిల్లలందరి బుద్ధిలో కూర్చోదు, ఒకవేళ కూర్చున్నట్లయితే సంతోషపు పాదరసం కూడా పైకి ఎక్కాలి. బాబాతో యోగం జోడిస్తూ ఉండాలి. బాబా అంటారు, ఆ పరంధామంలో ఉండే తండ్రిని, మీరు ఎక్కడికైతే వెళ్ళేది ఉందో, అక్కడ స్మృతి చేయండి. ఇప్పుడు డ్రామా పూర్తి అవ్వనున్నది. డ్రామా గురించి ఎవరికీ తెలియనే తెలియదు. ఎవరికీ నా పట్ల ప్రీతి లేదు. మేము పరంపరగా గంగా స్నానాలు చేస్తూ వచ్చామని అంటారు. సత్యయుగంలో కూడా చేసేవారా? పరంపర యొక్క అర్థాన్ని కూడా అర్థం చేసుకోరు. బాబా అంటారు, ఇప్పుడు మీ సుఖం యొక్క రోజులు వస్తున్నాయి. మీ బుద్ధిలో ఓర్పు ఉంది. కొందరైతే ఏమీ అర్థం చేసుకోరు. ఇక్కడ అర్థం చేసుకున్న తర్వాత, ఎప్పుడైతే బయటకు వెళ్తారో, అప్పుడు మాయ అంతా తినేస్తుంది. ఎలాగైతే ఈగ మరణించినప్పుడు, చీమలన్నీ దానిని మింగేస్తాయి, ఇక్కడ కూడా మరణిస్తే చీమలు తీసుకుపోయి మొత్తానికి మింగేస్తాయి. మాయ కూడా బలశాలి, తక్కువైనదేమీ కాదు. పెద్ద యుద్ధం జరుగుతుంది. ఇక్కడ ఉంటూ కూడా క్లాసుకు రాకపోతే, వారు స్వర్గానికి యజమానులుగా అవ్వలేరని, కృష్ణపురిలోకి వెళ్ళలేరని అర్థం చేసుకోవడం జరుగుతుంది. వారికి ఏ విలువ ఉండదు. మీలో ఎవరైతే వజ్రం వలె తయారవుతారో, వారికే విలువ ఉంది. మనం యోగ్యులుగా అవుతున్నామని మీకు తెలుసు. ఒకే ఇంట్లో ఒక హంస, ఒక కొంగ ఉన్నట్లయితే గొడవలు తప్పకుండా జరుగుతాయి. ఇక్కడైతే కొంగల నుండి తప్పుకోవడం జరుగుతుంది. మురికి పట్టిన వస్త్రాల వంటివారి చేతి భోజనాన్ని మీరు తినకూడదు కూడా. కానీ పిల్లలకు తండ్రి పట్ల అంత ప్రేమైతే లేదు, అందుకే కడుపు ఎలా నిండుతుంది అని ఆలోచిస్తారు. అరే, ఆటవికులు ఎక్కడి నుండి తింటారు. ఈ రోజుల్లోనైతే ఎవరైనా కాషాయ వస్త్రాలు ధరిస్తే చాలు, ఏ కష్టం లేకుండా ధనం లభిస్తూ ఉంటుంది. అందరూ పాదాలపై పడుతూ ఉంటారు, ఎవరెవరు వస్తారో, వారి మూర్తి ఎదురుగా ధనం పెడుతూ వెళ్తారు, చాలా సులభము. ఈ ప్రపంచమే ఇలా ఉంది. ఈ ప్రపంచం త్వరగా సమాప్తమైపోతే స్వర్గంలోకి వెళ్ళాలి అని పిల్లలు ఆలోచించాలి, కానీ యోగ్యులుగా కూడా అవ్వాలి కదా. పదవిని కూడా పొందాలి కదా! అక్కడ కూడా హోదాలో తేడా ఉంటుంది. చదివించేవారు ఒక్కరే. కొందరు రాజా-రాణిగా, కొందరు నౌకర్లుగా, కొందరు షావుకారు ప్రజలుగా అవుతారు. రాజధాని స్థాపన అవుతూ ఉంది. ఇతర ధర్మ స్థాపకులు రాజ్యాన్ని స్థాపన చేయరు, అందుకే బాబా అంటారు, జాగ్రత్తగా ఉండండి. వినాశకాలే పూర్తి ప్రీతి బుద్ధి కావాలి. ఎంత ప్రీతి ఉంటుందో, అంతగా తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారు. స్మృతి చేయడం కూడా నేర్పించడం జరుగుతుంది. బాబా తెలియజేస్తారు, బాబాను మరియు చక్రాన్ని స్మృతి చేయండి. స్వదర్శన చక్రాన్ని తిప్పండి. మనం లైట్ హౌస్ లము, నావికుడు మన నావను తీరానికి తీసుకువెళ్తారు. ఒక కంటిలో శాంతిధామాన్ని, ఒక కంటిలో సుఖధామాన్ని ఉంచుకోవాలి. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ప్రతి పాత్రధారి యొక్క పాత్రను చూస్తూ, ఎవరినీ అసహ్యించుకోకూడదు. మనసా-వాచా-కర్మణా ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు.

2. తండ్రికి తమ పూర్తి లెక్కాపత్రాన్ని ఇవ్వాలి. వినాశకాలే పూర్తి ప్రీతి బుద్ధి కలవారిగా అవ్వాలి. శ్రీమతం ఆధారంగా తమ నడవడికను శ్రేష్ఠంగా తయారుచేసుకోవాలి. చెడు సాంగత్యం నుండి సంభాళించుకోవాలి.

వరదానము:- సూక్ష్మ పాపాల నుండి ముక్తులై సంపూర్ణ స్థితిని ప్రాప్తి చేసుకునే సిద్ధి స్వరూప భవ

చాలామంది పిల్లలు వర్తమాన సమయంలో కర్మల గతి యొక్క జ్ఞానంలో చాలా ఈజీ అయిపోయారు, అందుకే చిన్న-చిన్న పాపాలు జరుగుతూ ఉంటాయి. కర్మ ఫిలాసఫీ యొక్క సిద్ధాంతం ఏమిటంటే - ఒకవేళ మీరు ఎవరినైనా నిందిస్తే, ఎవరి పొరపాటు (చెడు) నైనా వ్యాపింపజేస్తే లేదా ఎవరైనా ఇలాంటివి వినిపించినప్పుడు వారి మాటకు అవును అని చెప్పినట్లయితే, అప్పుడు మీరు కూడా పాపంలో భాగస్థునిగా అవుతారు. ఈ రోజు మీరు ఎవరినైనా నిందిస్తే, రేపు వారు మిమ్మల్ని రెండింతలు నిందిస్తారు. ఈ చిన్న-చిన్న పాపాలు సంపూర్ణ స్థితిని ప్రాప్తి చేసుకోవడంలో విఘ్న రూపంగా అవుతాయి, అందుకే కర్మల గతిని తెలుసుకొని పాపాల నుండి ముక్తులుగా అయి సిద్ధి స్వరూపులుగా అవ్వండి.

స్లోగన్:- ఆది పిత సమానంగా అయ్యేందుకు శక్తి, శాంతి మరియు సర్వ గుణాల స్తంభంగా అవ్వండి.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

“నిరాకారీ ప్రపంచం అనగా ఆత్మల నివాస స్థానము”

మనం నిరాకారీ ప్రపంచం అని అన్నప్పుడు నిరాకారానికి అర్థము, దానికి ఆకారమేమీ లేదని కాదు. దాని అర్థమేమిటంటే, తప్పకుండా ఏదో ప్రపంచం ఉంది, దానికి స్థూల సృష్టి వంటి ఆకారం లేదు. ఏ విధంగానైతే, పరమాత్మ నిరాకారుడు కానీ వారికి తమ సూక్ష్మ రూపం తప్పకుండా ఉంది. ఆత్మలైన మన ధామము మరియు పరమాత్ముని ధామము నిరాకారీ ప్రపంచము. కనుక ఎప్పుడైతే మనం ప్రపంచము అనే పదాన్ని ఉపయోగిస్తామో, దీనితో ఏమి ఋజువవుతుందంటే - అది ప్రపంచము మరియు అక్కడ ఎవరో ఉంటారు, అందుకే ప్రపంచము అనే పేరు వచ్చింది. ఇప్పుడు ప్రాపంచిక మనుష్యులు, పరమాత్మ రూపం కూడా అఖండ జ్యోతి తత్త్వమని భావిస్తారు, కానీ అది పరమాత్మ నివసించే నివాస స్థానము, దానిని రిటైర్డ్ హోమ్ అని అంటారు. కనుక మనం పరమాత్ముని ఇంటిని పరమాత్మ అని అనలేము. ఇప్పుడు రెండవది ఆకారీ ప్రపంచము, అక్కడ దేవతలైన బ్రహ్మ, విష్ణు, శంకరులు ఆకారీ రూపంలో ఉంటారు మరియు ఇది సాకారీ ప్రపంచము, దీనిలో రెండు భాగాలున్నాయి - ఒకటి, నిర్వికారీ స్వర్గం యొక్క ప్రపంచము, అక్కడ అర్ధకల్పం సదా పవిత్రత, సుఖము మరియు శాంతి ఉంటాయి. రెండవది - వికారీ కలియుగీ దుఃఖము మరియు అశాంతి యొక్క ప్రపంచము. ఇప్పుడు వీటిని రెండు ప్రపంచాలని ఎందుకు అంటారు? ఎందుకంటే మనుష్యులు - స్వర్గము మరియు నరకము, ఈ రెండూ పరమాత్మ చేత రచించబడిన ప్రపంచాలు అని అంటారు. దీని గురించి పరమాత్ముని మహావాక్యాలు ఏమిటంటే - పిల్లలూ, నేను దుఃఖపు ప్రపంచాన్ని ఏమీ రచించలేదు, నేను ఏదైతే ప్రపంచాన్ని రచించానో, అది సుఖపు ప్రపంచము. ఇప్పుడు ఈ దుఃఖం మరియు అశాంతి యొక్క ప్రపంచం ఏదైతే ఉందో, ఇక్కడ మనుష్యాత్మలు తమను తాము మరియు పరమాత్మనైన నన్ను మర్చిపోయిన కారణంగా ఈ లెక్కాచారాన్ని అనుభవిస్తున్నారు. ఇకపోతే, ఏ సమయంలోనైతే సుఖం మరియు పుణ్యం యొక్క ప్రపంచం ఉంటుందో, అక్కడ సృష్టి నడవదని కాదు. అయితే, అక్కడ దేవతల నివాస స్థానం ఉండేది అని మనం అంటున్నామంటే, తప్పకుండా అక్కడ ప్రవృత్తి మార్గం నడిచేది, కానీ వికారి జన్మ ఉండేది కాదు. అందుకే ఏ కర్మ బంధనము ఉండేది కాదు. ఆ ప్రపంచాన్ని కర్మ బంధన రహితమైన స్వర్గ ప్రపంచం అని అంటారు. కావున ఒకటి - నిరాకారీ ప్రపంచము, రెండవది - ఆకారీ ప్రపంచము, మూడవది - సాకారీ ప్రపంచము.

“భగవంతుడు వచ్చేటువంటి అనాదిగా రచించబడిన ప్రోగ్రామ్”

మనుష్యులు, ఓ గీతా భగవంతుడా, మీ మాట నిలబెట్టుకునేందుకు రండి అని పాట పాడుతారు. ఇప్పుడు స్వయంగా ఆ గీతా భగవంతుడు, వారు కల్పక్రితం ఇచ్చిన ఆ మాటను నిలబెట్టుకునేందుకు వచ్చారు మరియు ఇలా అంటున్నారు - ఓ పిల్లలూ, ఎప్పుడైతే భారత్ లో అతి ధర్మగ్లాని ఉంటుందో, అప్పుడు నేను అదే సమయంలో, నా ప్రతిజ్ఞను నిలబెట్టుకునేందుకు తప్పకుండా వస్తాను. అయితే, నేను వస్తాను అంటే ప్రతి యుగంలోనూ వస్తానని కాదు. అన్ని యుగాలలోనూ ధర్మగ్లాని ఏమీ ఉండదు. ధర్మగ్లాని కలియుగంలోనే ఉంటుంది కావున పరమాత్మ కలియుగ సమయంలోనే వస్తారని అర్థం చేసుకోండి. మరియు కలియుగం కల్ప-కల్పము వస్తుంది కనుక వారు కూడా తప్పకుండా కల్ప-కల్పము వస్తారు. కల్పంలో నాలుగు యుగాలు ఉంటాయి, దానినే కల్పము అని అంటారు. అర్ధకల్పము సత్య-త్రేతా యుగాలలో సతోగుణము, సతోప్రధానత ఉంటాయి, అక్కడ పరమాత్మ రావాల్సిన

అవసరమేమీ ఉండదు. మరియు ద్వాపర యుగం నుండి ఇతర ధర్మాలు ప్రారంభమవుతాయి, ఆ సమయంలో కూడా అతి ధర్మగ్లాని ఉండదు. కావున పరమాత్మ మూడు యుగాలలో రారు అని దీని ద్వారా ఋజువవుతుంది. ఇక మిగిలింది కలియుగము, దాని అంతిమంలో అతి ధర్మగ్లాని ఉంటుంది. ఆ సమయంలోనే పరమాత్మ వచ్చి అధర్మాన్ని సమాప్తం చేసి సత్య ధర్మాన్ని స్థాపన చేస్తారు. ఒకవేళ ద్వాపరంలో వచ్చి ఉంటే, ద్వాపరం తర్వాత సత్యయుగం ఉండాలి, మరి కలియుగం ఎందుకు ఉంది? పరమాత్మ ఘోర కలియుగాన్ని స్థాపన చేసారు అని అనరు కదా. అలా జరగనే జరగదు. అందుకే పరమాత్మ అంటారు - నేను ఒక్కడినే, మరియు ఒక్కసారే వచ్చి అధర్మాన్ని వినాశనం చేసి, కలియుగాన్ని వినాశనం చేసి, సత్యయుగాన్ని స్థాపన చేస్తాను కావున నేను వచ్చే సమయము సంగమయుగము. అచ్ఛా - ఓంశాంతి.